
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 7 మార్చి 2025



నరేందర్‌రెడ్డి విమర్శనాస్త్రాలు ఎవరిపై?

- లోటుపాట్లపై నివేదిక ఇస్తానని ప్రకటన
- మూడు నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గాయని ఆవేదన
- జిల్లాలో నాయకత్వ లోపముందని వ్యాఖ్య



పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ పరాజయం పొందింది. సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవడంతో ఆ పార్టీ శ్రేణులు నిరాశ చెందారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విలేకరుల సమావేశం పెట్టి పలు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌కు జిల్లాలో నాయకత్వ లోపం ఉందని, దీనిని అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్తానని వాఖ్యానించడం పార్టీలో కలకలం సృష్టిస్తున్నది. చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో తనకు ఓట్లు తక్కువ వచ్చాయన్నారు. పార్టీ ప్రక్షాళనకు తనవంతు కృషిచేస్తానని అనడంతో ఆయన ఎవరిపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేయనున్నారు అన్నది చర్చనీయాంశంగా మారింది.

7

ఆస్తి పన్ను వసూళ్లపై స్పెషల్ ఫోకస్



- వందశాతం లక్ష్యంగా ముందకు..
- మొండి బకాయిదారుల ఆస్తులు జప్తు చేసేందుకు నిర్ణయం
- 'భువన్' యాప్‌తో ఆస్తిపన్నుల సవరణ

కరీంనగర్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడుతుండడంతో మున్సిపల్ అధికారులు ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించారు. మార్చి 31లోగా వంద శాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యం నిర్దేశించడంతో లక్ష్య సాధనకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇప్పటి వరకు హుజూరాబాద్ మున్సిపాలిటీ 92.45 శాతం ఆస్తి పన్నులు వసూలు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది.

91.72 శాతం పన్నులను వసూలు చేసి జమ్మికుంట రెండో స్థానంలో నిలువగా, కరీంనగర్ కార్పొరేషన్ 54.4 శాతం వసూళ్లతో 66వ స్థానంలో, చొప్పదండి 54.22 శాతంతో 69వ స్థానంలో నిలిచింది. మార్చి 31లోగా అన్ని మున్సిపాలిటీల్లో వంద శాతం ఆస్తిపన్నులను వసూలు చేయాలని మున్సిపల్ ఉన్నతాధికారులు ఆదేశించడంతో మున్సిపల్ అధికారులు వారం, పది రోజులుగా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

కరీంనగర్‌లో లక్ష్యానికి దూరంగా..

కరీంనగర్ కార్పొరేషన్‌లో గత ఏడాది 94 శాతం పన్నులు వసూలు కాగా మార్చి 6వ తేదీ వరకు ఈ యేడాదిలో కేవలం 54.4 శాతం మాత్రమే ఆస్తి పన్నులు వసూలయ్యాయి. సమగ్ర కుటుంబ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక, ఇతరత్రా అదనపు విధులను మున్సిపల్ ఉద్యోగులకు అప్పగించడంతో ఆ ప్రభావం ఆస్తిపన్నుల వసూళ్లపై పడింది. మిగిలిన 25 రోజుల్లో వందశాతం పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. నగరపాలక సంస్థలోని 60 డివిజన్లతో పాటు ఇటీవల విలీనం చేసిన కొత్తపల్లి మున్సిపాలిటీ, చింతకుంట, మల్కాపూర్, బొమ్మకల్, గోపాల్‌పూర్ గ్రామ పంచాయతీల ఆస్తిపన్నుల వసూళ్ల బాధ్యతలను వార్డు ఆఫీసర్లకు అప్పగించారు.

ఒక్కో వార్డు ఆఫీసర్‌కు ఆస్తి పన్నుల వసూళ్లకు సంబంధించిన డివైజ్‌లను అప్పగించారు. వారికి కేటాయించిన డివిజన్లలో ఇంటింటికి వెళ్లి పన్నులు చెల్లించాలంటూ ఇంటి యజమానులను కోరుతున్నారు. 31లోగా పన్నులు చెల్లించకుంటే రెండు శాతం వడ్డీ పడుతుందని, వడ్డీభారం లేకుండా తమ వద్ద చెల్లించి రశీదు పొందాలని కోరుతున్నా రు. మరోవైపు ఆన్‌లైన్‌లోకానీ, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో కానీ ఆస్తి పన్నులను స్వీకరిస్తున్నారు.

విలీన ప్రాంతాల్లో పేరుకుపోయిన బకాయిలు

భువన్ యాప్ ద్వారా 2024 అక్టోబరు నుంచి నిర్ధారించిన ఆస్తి పన్నులను సవరించి వసూలు చేస్తున్నారు. గతంలో చేసిన కట్టడాలకు సంబంధించిన కొలతలు, ఇళ్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కమర్షియల్ టాక్సులను వసూలు చేస్తున్నారు. దీంతో చాలా మంది ఆస్తి పన్నులు పెరిగాయంటూ గగ్గోలు పెడుతున్నారు. కొలతల ప్రకారంగా ఆస్తి పన్ను నిర్ధారిస్తామని, ఎక్కువ పన్ను వచ్చినట్ల నిపిస్తే దరఖాస్తు చేసుకోవాలని, తిరిగి కొలతలు తీసుకొని పన్నులను సవరిస్తామని అధికారులు చెబుతున్నారు.

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 86,831 నివాస, వాణిజ్య గృహాలు ఉండగా వాటి ద్వారా 50.57 కోట్ల ఆస్తి పన్నుల ద్వారా నగరపాలక సంస్థకు ఆదాయం వస్తుంది. ఇప్పటి వరకు కేవలం 27.51 కోట్ల రూపాయల పన్నులు మాత్రమే వసూలు అయ్యాయి. ఇటీవల విలీనమైన చింతకుంట, మల్కాపూర్, బొమ్మకల్, గోపాల్‌పూర్ గ్రామాలతో పాటు కొత్తపల్లి మున్సిపాలిటీల్లో కోట్లలోనే బకాయిలు పేరుకు పోయాయి. దీంతో ఆస్తిపన్నుల డిమాండ్ పెరగడమే కాకుండా వసూళ్ల శాతం తగ్గిపోతోందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇందుకోసం ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ఆస్తి పన్నుల ను వసూలు చేస్తున్నారు. మరోవైపు 60 డివిజన్ల లోని మొండి బకాయిలను వసూలు చేసేందుకు అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్టు (ఆర్ఆర్) చట్టాన్ని అమలు చేసి ఆస్తులను జప్తు చేస్తామంటూ నోటీసులు జారీ చేస్తున్నారు. ఆస్తి పన్ను బకాయిల చిట్టాను ఆయా ఇళ్ల ఎదుట అతికించి ఒత్తిడి తెస్తు న్నారు. వార్డు అధికారులు, రెవెన్యూ సిబ్బంది కలిసి ప్రతి రోజు డివిజన్లలో ఇంటింటికి వెళ్లి పన్నులను వసూలు చేసి మిగతా 8వ పేజీలో

వందశాతం పన్నులను వసూలు చేసేందుకు కృషి : డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి

నగరపాలక సంస్థలో వందశాతం ఆస్తిపన్నులను మార్చి 31లోగా వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి తెలిపారు. పట్టణ ప్రజలు ఆస్తిపన్నులను, బకాయిలను వెంటనే చెల్లించి వడ్డీ భారం పడకుండా చూసుకోవాలని, నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. బకాయిలను చెల్లించకుంటే మున్సిపల్ ఆర్ఆర్ చట్ట ప్రకారంగా ఆస్తులను జప్తు చేస్తామని, అంత వరకు రాకుండా పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 357 మంది గైర్హాజరు



ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు

కరీంనగర్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలకు 357 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్, వొకేషనల్ విభాగంలో కలిపి 15,639 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా జనరల్ విభాగంలో 282 మంది, వొకేషనల్‌లో 75 మంది మొత్తం 357 మంది పరీక్షలకు హాజరు కాలేదు. జనరల్ విభాగంలో 14,032 మంది, వొకేషనల్‌లో 1,250 మంది మొత్తం 15,282 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి ఒక్కో సెంటర్‌కు ఒక చీఫ్‌సూపరిం టెండెంట్, ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, కాపీయింగ్ జరుగకుండా ఉండేందుకు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని పరీక్షల కన్వీనర్, డీఐఈవో తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశాయని, ఎక్కడ కూడా కాపీయింగ్ జరుగలేదని చెప్పారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

సుభాష్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్కానింగ్, ఫెర్టిలిటీ సెంటర్లను రాష్ట్ర స్థాయి ఇన్‌స్పెక్షన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఇన్‌చార్జి డాక్టర్ సూర్యశ్రీరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ బృందంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సభ్యురాలిగా ఉన్నారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్‌కు వచ్చిన పేషంట్లకు సంబంధించిన వివరాలు, పీసీపీఎన్‌డీటీ జిల్లా అప్రొప్రియేట్ అథారిటీ కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, అందులో పనిచేస్తున్న డాక్టర్ల అర్హతకు సంబం ధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994, రూల్స్ 1996 అమలు తీరును పరిశీలించారు. స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే పరీక్షలు చేసిన వారికి, చేయించిన వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమాన విధిస్తామని హెచ్చరించారు. ఈ విషయాలు తెలుపుతూ ప్రతి స్కానింగ్ సెంటర్‌లో బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. రికార్డులు సరిగా నిర్వహించాలన్నారు. తనిఖీల్లో పీవోడీటీటీ డాక్టర్ ఉమశ్రీ, పీసీపీఎన్ డీటీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సనజ వేరియా, సఖి కన్సల్టెంట్ డి లక్ష్మి, డాటా ఎంట్రీ ఆపరేటర్ కె రమేష్, డెమో రాజగోపాల్ పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో మెరుగైన ర్యాంకు సాధించాలి

కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో ఈ సంవత్సరం మరింత మెరుగైన ర్యాంకు సాధించేందుకు పారిశుధ్య పనులు మరింత మెరుగు పరచాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం ఆమె హౌసింగ్‌బోర్డు కాలనీ రీసోర్సు పార్కును సందర్శించి నూతన డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్, కంపోస్టు పిట్స్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఐటీసీ సంస్థ ద్వారా నూతన డ్రై రీసోర్సు కలెక్షన్ సెంటర్, వర్మీ కంపోస్టు తయారీ పిట్స్ నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. నూతన డీఆర్‌సీసీ సెంటర్, వర్మికంపోస్టు పిట్స్ నిర్మిస్తే చెత్త నుంచి సేంద్రీయ ఎరువుతో పాటు పొడి చెత్తను వేరు చేయవచ్చన్నారు. పొడి చెత్తను వేరు చేసేందుకు ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రీసోర్స్ పార్కుకు వచ్చే తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు చెత్తను తగ్గించే ప్రక్రియ చేపడతామన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సతీష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలు

యూకేజీ, ఒకటో తరగతులకు నేటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం



తిమ్మాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌లో బాలవాటిక (యూకేజీ), ఒకటో తరగతిలో 2025 సంవత్సరానికి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలయింది. ఈ నెల 7 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలై 21తో ముగుస్తుంది. 1 ఏప్రిల్, 2025 నాటికి ఐదు సంవత్సరాలు నిండి ఏడు సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాల బాలికలు బాల వాటిక (యూకేజీ)లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 1 ఏప్రిల్, 2025 నాటికి ఆరు సంవత్సరాలు నిండి ఎనిమిది సంవత్సరాలలోపు వయసు ఉన్న బాల బాలికలు ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బాల వాటిక, ఒకటో తరగతిలో మొత్తం 40 సీట్లు ఉండగా ఇందులో 10 సీట్లు విద్యాహక్కు చట్టం ప్రకారం భర్తీకి కేటాయించారు. మిగిలిన 30 సీట్లను కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ప్రవేశ మార్గదర్శకాల్లో సూచించిన ప్రాధాన్యాల ప్రకారం భర్తీ చేయనున్నారు.

ఇందులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల పిల్లలకు రెండో ప్రాధాన్యం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మూడో ప్రాధాన్యం ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల పిల్లలకు నాలుగో ప్రాధాన్యం, మిగిలిన వారికి ఐదో ప్రాధాన్యం కింద ప్రవేశాలను కల్పిస్తామని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పంకజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

మిషన్ భగీరథ.. నీరు చేరేదెలా..?

- 70 కిలోమీటర్ల నుంచి చొప్పదండికి సరఫరా
- మంచినీటి బావులే ఆధారం

చొప్పదండి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణానికి మిషన్ భగీరథ నీరు చేరడం ఓ ప్రహసనంగా మారింది. పథకం ప్రారంభించి ఏళ్ల గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో నీరు ప్రజలకు అందుబాటులోకి రాలేదు. పట్టణంలోని పలు వాడలకు పాత పద్ధతిలోనే మంచినీటి బావుల ద్వారా పంపింగ్ చేసి నీటిని రెండు రోజులకు ఒక సారి సరఫరా చేస్తున్నారు. పట్టణంలో ఐదు వేలకు పైగా ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఉండగా అనేక ప్రాంతాలకు భగీరథ నీరు చేరడం లేదు.



మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్

ట్యాంకుల్లోకి చేరని నీరు

చొప్పదండి నియోజకవర్గానికి మిషన్ భగీరథ నీటిని వేములవాడ మండలంలోని పంప్ హౌస్ నుంచి సరఫరా చేస్తున్నారు. చొప్పదండి పట్టణం పంప్‌హౌస్ నుంచి 70 కిలోమీటర్ల దూరం ఉంది. దీంతో అంతదూరం నుంచి నీటి సరఫరా సరిగ్గా జరగడం లేదు. చొప్పదండి పట్టణం టెయిల్ ఎండ్‌గా మారగా నీటి సరఫరా సక్రమంగా కావడం లేదు. పైపు లైన్లలో వచ్చే కొద్దిపాటి నీళ్ల ఓవర్ హెడ్ ట్యాంక్‌ల్లోకి ఎక్కడం లేదు. పట్టణంలోని విజయనగరం అబాది,, వ్యవసాయ మార్కెట్ ప్రాంతాలకు ఇప్పటి వరకు భగీరథ నీరు చేరక పోగా ప్రజలు ఇప్పటి వరకు భగీరథ నీటిని చూడలేదు.

ఎక్స్‌ప్రెస్ లైన్ ఏర్పాటుకు గ్రహణం

పట్టణానికి భగీరథ నీటిని అందించేందుకు కొండగట్టు నుంచి నేరుగా చొప్పదండికి ఎక్స్‌ప్రెస్ లైన్‌ను ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిదులు హామీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదు. వేములవాడకు బదులుగా కరీంనగర్ రూరల్ మండలానికి నీరు సరఫరా అయ్యే నగునూరు పైప్ లైన్‌ను చొప్పదండికి పొడగిస్తే నీరు అందుతుందని స్థానికులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. నగునూర్ నుంచి కేవలం ఏడు కిలో మీటర్ల పైప్‌లైన్ వేసి నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినా ఫలితం లేదు. 70 కిలోమీటర్ల దూరం నుంచి నీరు తీసుకురావ డానికి బదులుగా ఏడు కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే చొప్పదండితోపాటు మార్గమధ్యలోని రుక్మాపూర్, చాకుంట కొలిమికుంట గ్రామాలకు నీటిని అందించవచ్చు. ప్రస్తుతం ఈ గ్రామాలకు భగీరథ నీరు సక్రమంగా అందడం లేదు. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.





చొప్పదండిలోని మంచినీటి బావి, నిరుపయోగంగా నీటి కనెక్షన్

విద్యార్థిని పరామర్శించిన కలెక్టర్




విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాలు విరిగి చికిత్స పొందుతున్న విద్యార్థి రఘువర్దన్‌ను కలెక్టర్ పమేలాసత్పతి గురువారం పరామర్శించారు. మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతన్న రఘువర్దన్ కోతి వస్తుందని భయపడి పాఠశాల మొదటి అంతస్తు నుంచి కిందకు దూకాడు. దీంతో అతని కాలు ఎముక విరగడంతో కొద్దిరోజులు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందాడు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు రఘువర్దన్‌ను జిల్లా ఆసుపత్రికి తీసుకుచ్చి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. గురువారం అతడిని కలెక్టర్ పరామర్శించారు. అన్ని విషయాలకు భయపడవద్దని బాగా చదువుకోవాలని సూచించారు. అవసరమైన పుస్తకాలు తెప్పిస్తానని చెప్పారు. అనంతరం ఆసుపత్రిలో త్వరలో ప్రారంభించనున్న క్రిటికల్ కేర్ విభాగాన్ని సందర్శించారు. అందులో కావలసిన సౌకర్యాల గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్ఎంవో డాక్టర్ నవీన ఉన్నారు.

విద్యుత్ మీటర్ టాంపరింగ్ చేస్తే కఠిన చర్యలు

కరీంనగర్ క్రైం , మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో విద్యుత్ మీటర్‌లోని వైర్లను తొలగించి టాంపరింగ్‌కు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎండీ ఎస్ బాబా గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో కొంత మంది వ్యక్తులు ఇళ్లలోకి వచ్చి మీటర్ తిరుగకుండా, విద్యుత్ బిల్లు ఎక్కువ రాకుండా చేస్తామంటూ వినియోగదారుల వద్ద డబ్బులు తీసుకుని మీటర్‌లోని వైర్లను కట్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధంగా చేయడం చట్ట విరుద్ధమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇలా తప్పుడు పనులు చేసేందుకు వస్తున్నవారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సీఐ సూచించారు.





మధుర ఫలం ఖర్జూరం

● పరిపూర్ణ ఆరోగ్యం, సౌందర్యానికి వరం
● రంజాన్ సంప్రదాయ ఫలం ● పోషకాలు ఎన్నో..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎన్నో పోషకాలు ఉన్న ఎడారి పండు ఖర్జూరం. ఔషధ గుణాలు ఎక్కువగా ఉన్న ఖర్జూర ఫలంతోనే ముస్లింలు రంజాన్ మాసంలో ఉపవాసాన్ని విరమిస్తారు. మహ్మద్ ప్రవక్త ఖర్జూర ఫలాన్ని ఎంతో ఇష్టంగా ఆరగించేవారని, అందుకే ఖర్జూర ఫలం ముస్లింలకు సంప్రదాయ ఫలంగా మారిందని చెబుతారు. అందుకే సాధారణ రోజుల్లో ఖర్జూరం మార్కెట్‌లో తక్కువగా కనిపించినా రంజాన్ మాసంలో ఎక్కువగా దిగుమతి అవుతాయి.

40 రకాల ఖర్జూర పండ్లు ఇప్పుడు మార్కెట్‌లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. గల్ఫ్ దేశాల నుంచి అందులో అత్యధికంగా సాగుచేసే ఇరాక్, ఇరాన్, సౌదీఅరబ్, యెమెన్, అల్జీరియా, మొరాకో దేశాల నుంచి 80శాతం వరకు హైదరాబాద్, బెంగుళూర్ వంటి నగరాలకు లక్షలాది టన్నులు దిగుమతి అవుతుంది. ఖర్జూర పండ్లలో అత్యంత ఖరీదైనది అజ్వా ఖర్జూరం కిలో రూ.1800 నుంచి రెండు వేల వరకు ధర పలుకుతుంది. మిగతా రకాలు రూ.60 నుంచి రూ.600 వరకు ఉంటాయి. ఖర్జూరం రుచికరంగా ఉండడమే కాకుండా పోషకాలు మెండుగానే ఉంటాయి.

ఖర్జూరంలో ఉండే పోషకాలు..

ఖర్జూర పండ్లలో పోషకాలు, ఔషధ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇందులో గ్లూకోజ్, ఫ్రూటోజ్ వంటి ప్రకృతి సిద్ధమైన చక్కెర పదార్థాలు ఉంటాయి. దీంతో శరీరంలో త్వరగా కలిసిపోయి శక్తినిస్తాయి. వంద గ్రాముల ఖర్జూర పండ్లలో నీరు 15.3 శాతం, ప్రోటీన్‌లు 2.5 శాతం, కొవ్వు 0.4 శాతం, కార్బొహైడ్రేట్ 75.8 శాతం ఉంటాయి. 120ల మిల్లీ గ్రాముల కాల్షియం, 50 మిల్లీగ్రాముల పాస్పరసం, 7.3 మిల్లీ గ్రాముల ఇనుము, 3 మీల్లీగ్రాముల విటమిన్ సీ, కొంత విటమిన్ బీ వంటివి ఉంటాయి. ఖర్జూరం ద్వారా కొలస్ట్రాల్ పెరుగుతుందనే భయం కూడా లేదు. వంద గ్రాముల్లో 315 క్యాలరీలు ఉన్నాయి.



ఖర్జూరం నిల్వ ఉంచుకునే పద్ధతి..

ఖర్జూరం పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. వీటిని నిల్వ ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటించాలి. గాలి చొరబడకుండా డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచితే ఖర్జూరం పండ్లు నెలరోజులు నిల్వ ఉంటాయి. ఎక్కువ ఖర్జూరాలు నిల్వ ఉంచుకోవాలనుకుంటే మరికొన్ని పద్ధతులు ఉంటాయి. ఖర్జూరాలు ప్రాసెసింగ్ ద్వారా పంచదార, జామ్, జెల్లి, జ్యూస్, సిరప్‌గా మార్చి విక్రయిస్తుంటారు.

మహిళలకు ఎంతో ఉపయోగం..

ఆరోగ్యం, సౌందర్యాన్ని పెంచే ప్రకృతి ఫలమైన ఖర్జూరం మహిళలకు ఎంతో ఉప యోగపడుతుంది. మహిళల్లో పోషక లోపం ఎక్కువగా ఉంటుంది. ఖర్జూరం వారికెంతో శక్తిని స్తుంది. ప్రతిరోజు గ్లాసు పాలతో ఖర్జూరాలను తింటే పరిపూర్ణ ఆరోగ్యాన్ని స్తుంది.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లి తండాకు చెందిన అజ్మీరా రాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని అజ్మీరా రాంసింగ్ ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రహదారి పనులను ఈనెల 4న స్థానిక వాటర్ ట్యాంకు నుంచి కెనాల్ వరకు చేపట్టాడని పేర్కొన్నారు .అదేరోజు అజ్మీరారాజు తన వ్యవసాయ పొలం నుంచి ఎందుకు సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని రాంసింగ్ భార్య లక్ష్మీ, అతని కొడుకు సాయికుమార్‌లను ప్రశ్నించాడని చెప్పారు. అంతటితో ఆగని అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు రోడ్డు పనులు చేస్తే చంపి వేస్తానంటూ దాడికి దిగాడని తెలిపారు. బాధితుడు రాంసింగ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

ప్రాణం తీసిన ఇసుర్రాయి వివాదం

● గోదావరిఖనిలో వృద్ధురాలి ఆత్మహత్య

కోల్‌సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని రమేష్‌నగర్‌లో ఇసుర్రాయి (తిరగలి) విషయంలో తలెత్తిన వివాదం ఒక వృద్ధురాలి ఆత్మహత్యకు దారి తీసింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్లెర్ల యశోద(65) గోదావరిఖని రమేష్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమె ఇంటికి పొరుగున ఉండే మాశెట్టి కళావతి ఇంట్లో ఇటీవల శుభకార్యం జరిగింది. ఆ శుభకార్యానికి యశోద ఇంట్లోని ఇసుర్రాయిని తీసుకెళ్లారు.



పల్లెర్ల యశోద(ఫైల్)

రోజులు గడిచినా ఇవ్వకపోవడంతో తిరిగి ఇవ్వమని యశోద అడిగింది. అది కనిపించడం లేదని వారు దురుసుగా సమాధానం చెప్పారు. ఈ విషయమై కళావతి, యశోద మధ్య గురువారం గొడవ జరిగింది. కళావతి కోడలు రమ్యశ్రీ అక్కడికి వచ్చి యశోదను తిట్టింది. కళావతి, ఆమె కోడలు రమ్యశ్రీ కలిసి యశోదను నెట్టివేయడంతో ఆమె కిందపడి పోయింది. స్థానికులు యశోదను లేపి ఇంట్లోకి పంపారు. కాలనీవాసుల ముందు తనను అవమానపరిచారనే మనోవేదనతో యశోద ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. యశోద కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు మాశెట్టి కళావతి, ఆమె కోడలు రమ్యశ్రీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ భూమేష్ తెలిపారు.

గొర్రెలు మాయంపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ముగ్గురు మాంసం విక్రయదారులకు చెందిన ఐదు గొర్రెలు మాయంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మిర్యాల్‌కార్ శ్రీకాంత్, మిర్యాల్‌కార్ రాజేశ్, మిర్యాల్‌కార్ ఐలోజీలు కలిసి 14 గొర్రె పొట్టేళ్లను వెంకటాపూర్ సంతలో కొనుగోలు చేసి వారి మందలో విడిచిపెట్టారని తెలిపారు. ఈ నెల 4న మందను అదే గ్రామానికి చెందిన ఒగ్గు ఎల్లయ్య మేత కోసం రెండవ బైపాస్ రోడ్డు వద్దకు తీసుకెళ్లాడు. సాయంత్రం గొర్రెల షెడ్డుకు చేరుకున్న మందలోని 5 గొర్రెలు కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేల విలువైన తమ జీవాలను అపహరించారని పేర్కొంటూ బాధితుడు మిర్యాల్‌కార్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు. కాగా మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి పోలీసులు ఐదు గొర్రెలను స్వాధీనపర్చుకుని తమకు అప్పగించారని బాధితులు పేర్కొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

- రెండు గ్రామాల్లో విషాదం

చొప్పదండి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన చొప్పదండి మండలంలోని రెండు గ్రామాల్లో విషాదం నింపింది. ప్రేమికులు ఇద్దరు చొప్పదండి మండలానికి చెందినవారు. చిట్యాలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్‌కుమార్ కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. భూపాలపట్నంకు చెందిన నాంపల్లి అలేఖ్య కరీంనగర్‌లో డిగ్రీ చదివింది. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారగా అలేఖ్యకు ఇటీవల పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. దీంతో తమ పెళ్లి కాదు అనుకొని ప్రేమికులు ఆత్మహత్యకు పాల్పడడం విషాదాన్ని నింపింది. అలేఖ్య తండ్రి బతుకుదెరువు కోసం గల్ఫ్‌లో ఉంటుండగా, కూతురు మరణవార్త విన్న తల్లిదండ్రి తల్లడిల్లిపోతున్నారు. మరికొద్ది రోజుల్లో పెళ్లి చేద్దామనుకున్న అలేఖ్య, అరుణ్ కుమార్ మరణ వార్త ఇరువురి కుటుంబాలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామలక్ష్మణపల్లె గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్సై సీహెచ్ గణేశ్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి నిర్వహించారు. పొలాల వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.13,340 తోపాటు కారు, నాలుగు బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. పీసీలు సంతోష్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

- మరో యువకుడికి తీవ్రగాయాలు

మంథనిరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిట్టుపల్లి గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఉదయ్(25) అనే యువకుడు మృతి చెందాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఉదయ్, మరో యువకుడు మంథనిలో జరిగిన తన స్నేహితుడి చెల్లి పెళ్లికి వచ్చారు. అనంతరం రాత్రి ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో స్నేహితుడి ఇంట్లో పడుకోవటానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బిట్టుపల్లి గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడగా ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన పెర్క రాయమల్లు (57) అనే వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయమల్లు భార్య కొంతకాలం క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగగా స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

కోరుట్ల మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

● విధుల్లో నిర్లక్ష్యం వహించాడని కలెక్టర్ వేటు

కోరుట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతిని సస్పెండ్ చేస్తూ గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విధులపై నిర్లక్ష్యం వహించడం, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు గౌరవ పారితోషికం పంపిణీలో జాప్యం వహించడం తదితర కారణాలతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బ్యాంకు ఖాతాల్లో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు సంబంధించిన బడ్జెట్‌ను జమ చేసినప్పటికీ వారి ఖాతాలకు బదిలీ చేయడంలో నిర్లక్ష్యం వహించాడని, శానిటేషన్ నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. అనుమతి లేని లే అవుట్స్‌ను నిరోధించడంలో విఫలం కావడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయడంలో నిర్లక్ష్యం వహించాడన్న కారణాలతో కమిషనర్ తిరుపతిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన స్థానంలో కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణకు పూర్తి అడిషనల్ చార్జిని అప్పగిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

హత్య కేసు నిందితుల రిమాండ్

జగిత్యాల రూరల్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ మండలంలోని తారక రామ్‌నగర్ గ్రామానికి చెందిన ఎస్‌కే రఫీ(28) అనే వ్యక్తి ఈ నెల1 టీఆర్‌నగర్ శివారు ఎస్సారెస్పీ కాలువ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. దీంతో తండ్రి ఎస్‌కే రజాక్ తన కుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రఫీక్ హత్యకు గురైనట్లు విచారణ జరిపి నిందితులను గుర్తించారు. హత్యకు పాల్పడ్డ నిందితులైన మహమ్మద్ రంజానీ, షేక్ మహమ్మద్, షేక్ శాదవ్‌లను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ ఇన్‌చార్జి సీఐ నీలం రవి, మల్యాల సీఐ పేర్కొన్నారు.

ఆయుర్వేద వైద్యం పేరుతో మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

● తెలుగు రాష్ట్రాల్లో 50 మందిని నమ్మించి రూ.6 లక్షలు వసూలు ● సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి

సిరిసిల్ల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ జిల్లా గౌరీబిందనూర్ తాలూకా నగిరెగెరె గ్రామానికి చెందిన అజయ్ (20) అనే నకిలీ వైద్యుడిని గురువారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన అజయ్ అనే నకిలీ వైద్యుడు తెలుగు రాష్ట్రాల్లో ద్విచక్రవాహనంపై సంచరిస్తూ అనారోగ్యానికి గురైన అమాయక ప్రజల వద్దకు వెళ్లి వారికి ఉన్న పక్షవాతం, ఇతర అనారోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యంతో తగ్గిస్తామంటూ రూ.10 వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేసి మళ్లీ వచ్చి వైద్యం చేస్తానని చెప్పి వెళ్లిపోతుంటాడు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అనంతపూర్, మహబూబ్ నగర్, నారాయణఖేడ్, రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో నిందితుడు సంచరిస్తూ అమాయక ప్రజలను నమ్మి మోసం చేస్తుంటాడు. ఇదే విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, శాత్రాజపల్లి, ముస్తాబాద్ మండలంలోని బద్నకల్, వెంకట్రావుపల్లిలో తిరుగుతూ నవంబరు 12, 2024న గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటకు వచ్చి కొడిమోజు లక్ష్మి భర్త ప్రభాకర్‌కు పక్షవాతం ఉందని తెలుసుకొని వారింటికి వెళ్లాడు. వ్యాధిని నయం చేస్తానని నమ్మించి ఆమె దగ్గర రూ.20 వేలు ఫోన్‌పే చేయించుకోవడమే కాకుండా బ్లాంకెట్లను తీసుకొని మందులు తెస్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇలా పలు గ్రామాల్లో నకిలీ వైద్యం పేరిట నమ్మించి దాదాపు రూ.6 లక్షల వరకు వసూలు చేశాడు. గంభీరావుపేటలో తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 50మందిని మోసం చేశానని అజయ్ ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా కృషి చేసి ఎస్‌ఐ శ్రీకాంత్, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనాథ్‌లను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



అజయ్

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి

ఇల్లంతకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శీలం రజనీకాంత్(26) అనే యువకుడు ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రజనీకాంత్ తంగళ్లపల్లి మండలం జిల్లెల క్రాసింగ్‌కు వెళ్లి గురువారం రాత్రి ఇంటికి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో వాహనంతో సహాపడి మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బావిలో నుంచి తీయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

మంథనిరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ గ్రామం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మామిడి రామకృష్ణ, పిట్టల శ్రీనివాస్, మేకల రమేష్‌లు టీఎస్ 25 టీ 6542, టీఎస్ 25 టీ 6622 అనే రెండు టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా టిప్పర్లలో ఇసుక నింపిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్, ఓనర్ ఐలి కరుణాకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

బైకు, రెండు ఆటోలను ఢీకొట్టిన కారు

● కారులో బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన పెను ప్రమాదం
● ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

శంకరపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బైకు.. రెండు ఆటోలను ఢీకొట్టి ఓ కారు బోల్తా పడ్డ ఘటనలో ఒకరు తీవ్రంగా, పలువురు స్వల్పంగా గాయపడ్డారు. గురువారం శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారులో ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన గుడిపాటి భూపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవి, సునీత, మానస, సుజాత, అయాన్స్‌లతో కలిసి కారులో కరీంనగర్‌లోని ఓ వివాహానికి హాజరై తిరిగి హనుమకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్, వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్, వంకాయగూడెం గ్రామాల మధ్య కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను, ప్యాసింజర్ ఆటోతో పాటు టాటా ఎస్ ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ప్యాసింజర్ ఆటోను బలంగా ఢీకొట్టడంతో ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటోడ్రైవర్ మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బైకుపై ప్రయాణిస్తున్న మానకొండూర్ మండలం శంషాబాద్‌కు చెందిన డొల్ల సతీష్, టాటా ఏసీ డ్రైవర్ తాడికల్‌కు చెందిన పెరిక రాజమల్లుకు స్వల్ప గాయాలయ్యాయి. పెరిక రాజమల్లును 108 వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను నమోదు చేసుకొని ప్రమాదంపై విచారణ చేపట్టారు.



నుజ్జునుజ్జు అయిన ఆటో



ప్రమాదంలో ధ్వంసమైన టాటా ఏస్ ఆటో

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ



దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

పెద్దపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) దొంగతనాలకు పాల్పడుతున్న పలువురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ చోరీ తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మల్హార్‌రావు మండల్ రెడ్డిపల్లికి చెందిన బొరిగం సంపత్ తన తల్లి చనిపోగానే తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. ఇంట్లో పరిస్థితులు అనుకూలించక చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఇదే క్రమంలో 2005లో దొంగతనానికి పాల్పడి అదే వృత్తిగా ఎంచుకున్నాడు. గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్, వరంగల్, హన్మకొండ, మంథని, కొయ్యూరు, హసన్‌పర్తి తదితర ఏరియాల్లో దొంగతనాలకు పాల్పడి 36 కేసుల్లో జైలు జీవితం అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మళ్లీ అదే వృత్తిని కొనసాగించాడు. ఇదే క్రమంలో ఈ నెల 2న కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాతుపల్లికి చెందిన మద్దెల శాంతమ్మ ఇంట్లో ఎవరు లేని సమయంలో చొరబడి బీరువా తాళం పగుల గొట్టి నగదు బంగారం దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తారుపల్లి వద్ద గురువారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన సంపత్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి నుంచి 2 లక్షల 25 వేల నగదు, 149 గ్రాముల బంగారం సుమారు(13 లక్షలు) ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుబ్బారెడ్డి, వెంకటేష్, సిబ్బంది అశోక్, లక్ష్మన్, వినుస్తర్, రవీందర్, ప్రభాకర్, రమేష్, రాజు, రాజ్‌కుమార్, లను ఏసీపీ అభినందించారు. దొంగను కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

సుల్తానాబాద్‌లో ఇద్దరు

● సుల్తానాబాద్: ఇళ్ల తాళాలు పగులకొట్టి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ గురువారం రాత్రి తెలిపారు. సుల్తానాబాద్ మార్కండేయ కాలనీకి చెందిన వేముల చంద్రప్రకాష్, సుల్తానాబాద్ గాంధీనగర్‌కు చెందిన బైరి కిరణ్ ఇద్దరు కలసి అనేక దొంగతనాలకు పాల్పడ్డారు. వేముల చంద్రప్రకాష్ గంజాయి కేసుల్లో కూడా పలు సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. గత జనవరి 17న గాంధీనగర్‌లోని వంగల శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంట్లో ఇద్దరు నిందితులు తాళాలు పగులకొట్టి టీవీ దొంగిలించారు. టీవీని అమ్మగా వచ్చిన 20వేల రూపాయలను ఇద్దరు పంచుకున్నారు. వీరి కోసం పోలీసులు గాలిస్తుండగా శాస్త్రినగర్ వద్ద పట్టుబడగా వానిరి అదుపులోకి తీసుకుని ఇరవై వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వేముల చంద్రప్రకాష్‌పై సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు కేసులు, పెద్దపల్లిలో ఒకటి, నిజామాబాద్‌లో ఒక కేసు, కరీంనగర్‌లో ఓ కేసు ఉందని ఎస్‌ఐ సీహెచ్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చొప్పదండిలో ఇద్దరు

● చొప్పదండి: చొప్పదండిలో కాపర్‌వైర్ దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. చొప్పదండిలోని శ్రీరామ ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రానిక్స్ గోదాంలో ఉన్న కాపర్‌వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని మంగళవారం ఫిర్యాదు చేయగా, గురువారం చొప్పదండి బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒక పెద్ద సంచితో అనుమానాస్పదంగా కనిపించారని తెలిపారు. ఇద్దరిని పట్టుకొని తనిఖీ చేయగా కాపర్ వైర్లు కనిపించాయని, విచారించగా దొంగలించిన సొత్తుగా గుర్తించి గోగులకొండ మహేష్, కడారి అభిషేక్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

గోగులకొండ మహేష్, రామ్‌టెక్ శివప్రసాద్, కడారి అభిషేక్‌లు స్నేహితులుగా ఉంటూ ఈజీ మనీ కోసం దొంగతనాలు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ రుద్రవ రం రాజు(47) గురువారం మృతి చెందాడు. రాజు మృతిపై అనుమానాలు న్నాయని మృతుడి తల్లి రుద్రవరం సుగుణ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజు కడుపులో ఇన్‌ఫెక్షన్‌తో అనారోగ్యానికి గురయ్యాడని, అతడి భార్య పట్టించుకోలేదని, బుధవారం తమ కొడుకును చూసేందుకు వెళ్లగా బయటకు గెంటేశారని, గురువారం ఉదయం రాజు మృతి చెందినట్లు సమా చారం అందించారని పేర్కొంది. కానిస్టేబుల్ రాజు మృతికి అతని భార్య, ఆమె తల్లిదండ్రులు, ఒక కానిస్టేబుల్ మరి కొందరిపై అనుమానాలున్నాయని తెలిపింది. దీనితో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పెళ్లి ఊరేగింపులో అపశ్రుతి

● నృత్యం చేస్తున్న వారిపైకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లిలో ఓ పెళ్లి ఊరేగింపులో గురువారం అపశ్రుతి చోటు చేసుకున్నది. పెళ్లి ఊరేగింపు జరుగుతుండగా ఓ కారు నృత్యం చేస్తున్నవారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నరేందర్‌రెడ్డి విమర్శనాస్త్రాలు ఎవరిపై?



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

- లోటుపాట్లపై నివేదిక ఇస్తానని ప్రకటన
- మూడు నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గాయని ఆవేదన
- జిల్లాలో నాయకత్వ లోపముందని వ్యాఖ్య

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోరాడి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి తన ఓటమికి గల కారణాలు, ఎన్నికల సందర్భం లో జరిగిన లోటుపాట్లపై పార్టీ నాయకత్వానికి నివేదిక ఇస్తానని ప్రకటిం చారు. కాంగ్రెస్‌కు జిల్లాలో నాయకత్వ లోపం ఉందని, దీనిని అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్తానని వాఖ్యానించడం పార్టీలో కలకలం సృష్టిస్తున్నది. చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు తక్కు వ వచ్చాయని, కరీంనగర్‌లో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు.

రాజకీయంగా ఎవరిపై బాణం ఎక్కుపెట్టారని చర్చించుకుంటు న్నారు. ఎన్నికల సందర్భంగా పార్టీ కార్యకర్తలు తన వద్దకు రావడానికి కొంత మంది అనుమతి తీసుకోవలసిన పరిస్థితి ఎదుర్కొన్నారని, పార్టీలో గ్రూపు రాజకీయాలు ఉన్న నేపథ్యంలో సమన్వయం పరిచే నాయకత్వం లోపించిందని నరేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ ప్రక్షాళనకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన డంతో ఆయన ఎవరిపై ఫిర్యాదు చేయనున్నారు అన్నది చర్చనీ యాంశంగా మారింది.

అన్ని వేళ్లూ అటు వైపే..

నరేందర్‌రెడ్డి ఓట్లు తక్కువ వచ్చాయని పేర్కొన్న మూడు నియోజక వర్గాల్లో సిరిసిల్ల మినహా మిగతా రెండింటిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాలు కరీంనగర్ పార్లమెం ట్ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలో మంత్రి పొన్నం ప్రభాకరే ఇప్పటికీ పూర్తి స్థాయిలో నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యత వహిస్తున్నారు. నరేందర్‌రెడ్డి అసంతృప్తి ఆయా నియో జకవర్గ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పైనేనా అన్న చర్చ సాగుతోంది. కరీంన గర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పురమల్ల శ్రీనివాస్ ఇదివరకే తనకు ఏ స్వేచ్ఛ లేకుండా పోయిందని, నియోజక వర్గ ఇన్‌చార్జిగా తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయిన వెలిచాల రాజేందర్‌రావు నిజానికి పార్లమెంట్ ఇన్‌చా ర్జిగా వ్యవహరించాలి. ఆయన పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నారో లేదో ఆయనకే తెలియని పరిస్థితి జిల్లాలో నెలకొన్నది.

కరీంనగర్ జిల్లా మొత్తం సుడా పరిధిలోకి వచ్చినా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి పలు సమావేశాలకు ఆహ్వానమే అందడం లేదు. ఈ ముగ్గురు నేతలు కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో ఉంటూ తమకు ప్రాధాన్యం లేకుండా పోయిందని పరోక్షంగా పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఇప్పుడు నరేందర్‌రెడ్డి కూడా వారి సరసనే చేరా రా... ఆయన పేరు పేర్కొనకపోయినా జిల్లాలో సమన్వయ పరిచే నాయకత్వం లేదనడం మంత్రి ఆ పని చేయడం లేదని పరోక్షంగా చెప్పడ మేనా... అని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు

ఒకటికి రెండు సార్లు మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతూ తన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని తనకు అండగా నిలిచారని ప్రకటించడం కూడా ఈ చర్చకు దారితీసినట్టు యింది. ఎన్నికల అనంతరం నరేందర్‌రెడ్డి రాజకీయాల్లో ఉండరు.. ఆయన స్కూల్స్ నడుపుకుంటారని వాఖ్యానించినవారికి జవాబుగా పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమి తనకు మరింత బాధ్యతలను పెంచిందని, కాంగ్రెస్ వాదిగా పార్టీలో మరింత చురుకుగా పనిచేస్తూ ఏ బాధ్యత అప్పగించినా నిర్వహిస్తానని, ఇక నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటానని ప్రకటించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తన ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని 42 నియోజకవర్గాలలో తాను గమనించిన సమస్య లను, పట్ట భద్రులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పడం రేపటి నుంచే తన కార్యాచరణ ప్రారంభమవు తుందని ప్రకటించడం పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలని అన్న నిర్ణయానికి నరేందర్‌రెడ్డి వచ్చారని ఆ పార్టీ నాయకులు అనుకుంటు న్నారు. నరేందర్‌రెడ్డి పార్టీలో లోటుపాట్ల పేరిట ఏ అంశాలు ప్రస్తావి స్తారు.. ఏ నాయకులపై ఫిర్యాదులు చేస్తారు... అన్నదే పార్టీలో సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్న అంశంగా మారింది.

కాంగ్రెస్‌వాదిగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతా

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తన బాధ్యతను మరింత పెంచిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ వాదిగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతానని ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేం దర్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావే శంలో మాట్లాడారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా తనపై చేసిన విషప్రచారాన్ని పట్టభద్రులు పట్టించు కోలేదని, తనకు అండగా నిలిచి ఓట్లు వేశారని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకోసం కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ శ్రేణులకు, అల్ఫోర్స్ కుటుంబ సభ్యులకు సీపీఐ, సీపీఎం, టీజేఎస్, వివిధ కుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాలకు కృతజ్ఞతలు తెలి పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని తనకు అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామో దర రాజన ర్సింహ, పొన్నం ప్రభాకర్‌తోపాటు నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం నిర్విరామంగా పనిచేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ప్రచారం, పోలింగ్‌బూత్‌ల మేనేజ్‌మెంట్ వరకు మంత్రే చూసు కున్నారని, తన గెలుపునకు తీవ్రంగా కృషి చేశారని అన్నారు. ఎన్నిక లకు ముందు నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని నియోజకవర్గాల్లో పట్టభద్రులకు ఇచ్చి న హామీల అమలుకు తన కార్యాచరణ ఉంటుందని, అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు.. కాం గ్రెస్‌లో లోటుపాట్లపై పార్టీ పెద్దలకు నివేదిక ఇస్తానని, పార్టీలో స్తబ్దత నెలకొందని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వేతనాలు అందక ఇబ్బందులు



రెండు నెలలుగా ఉపాధిహామీ సిబ్బంది ఎదురుచూపులు

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఉపాధినిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం సమయానికి వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఈజీ ఎస్ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవిలో ఉపాధిహామీ పథకాన్ని గ్రామాల్లో ఉద్యోగు లు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వర్తించే కార్యాలయ ఉద్యోగుల కు నెల రోజుల వేతనం రాకపోగా, గ్రామాల్లో విధు లు నిర్వర్తించే ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనా లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమ యానికి వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లే కీలకం

ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు కీలకపాత్ర పోషి స్తున్నారు. ఈజీఎస్ ద్వారా రైతువేదికల నిర్మాణాలు, రైతుకల్లాలు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, ఇంకుడు గుంతలు, మరు గుదొడ్ల నిర్మాణం, అవెన్యూ ప్లాంటేషన్, పశువుల షెడ్లు, మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, మొక్కల రక్షణ, కాలువ లు శుభ్రంతో పాటు పలు రకాల పనులను గ్రామా ల్లో చేపడుతున్నారు.

ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు సజావుగా నిర్వహిం చేందుకు కీలకపాత్ర పోషిస్తూ పనిభారంగా మారు తున్న అవేమీ పట్టనట్లుగా ఓపికతో నిర్వర్తిస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాలకు 30 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు 22 మంది మాత్రమే ఉన్నారు. వీరితో పాటు ఏపీవో, జేఈ ఒకరు, టెక్నికల్ అసి స్టెంట్‌లు ముగ్గురు, ఒకరు కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు.

ఉదయం నుంచే ఉపాధి పనుల్లో ఉద్యోగులు

తెల్లవారుజాము నుంచే ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాబ్ కార్డు దారుల వారికి ఉపాధి పనులు కల్పిస్తున్నారు. గ్రామాల వారిగా ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఇచ్చిన కొలతల ఆధారంగా కూలీలు పనులు ముగిం చుకొని వెళ్లే వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులు పర్య వేక్షిస్తునే ఉంటారు. వీరితో పాటు టెక్నికల్ అసిస్టెంట్ లు, ఉన్నతాధికారులు సైతం ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్నారు. కూలీలకు పనులతోపాటు హరిత హారంలో నాటిన మొక్కలను రక్షించేందుకు నీరు అం దించడం, నర్సరీల్లో మొక్కల పెంపుదల, పశువుల షెడ్లు అవసరం ఉన్నవారికి అమలు పనుల్లో ఉద్యో గులు నిమగ్నమవుతారు. అధికారులు ఇచ్చిన లక్ష్యాల కు అనుగుణంగా ఉపాధి కూలీలను తీసుకొచ్చే బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీసుకుంటున్నా ప్రభు త్వాలు పట్టించుకోని పరిస్థితి ఉంది.



పొద్దంతా కష్టపడుతున్నాం.. : సుమలత, కొత్తపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్

గ్రామాల్లో ఉదయం నుంచి చేపడుతున్న పనులను కిందిస్థాయి కూలీలతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వర్తిస్తున్నాం. కనీసం ప్రభుత్వం మమ్మల్ని గుర్తించని పరిస్థితి ఉంది. ఓ వైపు లక్ష్యాలు ఇస్తే వాటికి అనుగుణంగా పనులు పూర్తి చేస్తున్నాం. పొద్దంతా కష్టపడుతున్న సమయానికి వేతనాలు రాకపోవడంతో ఇంట్లో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ప్రభుత్వాలు చొరవ తీసుకొని ప్రతీ నెల మొదటి వారంలోనే వేతనాలు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలి.

ప్రతి నెల వేతనాలు అందించాలి

రమేష్‌బాబు, ఏపీవో, పెద్దపల్లి



పనులకు అనుగుణంగా సమయా నికి ప్రతీ నెల వేతనాలు అందించాలి. నిత్యం ఫీల్డ్ ఉంటున్న ఈజీఎస్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను సమయానికి అందిస్తే ఆర్థిక ఇబ్బం దులకు గురికాకుండా ఉంటాం.

ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- ఈ నెల 10 నుంచి ప్రారంభం

ధర్మపురి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మార్చి 10 నుంచి 22 వరకు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తు న్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు గోపురాలకు, దేవాలయం లోపల రంగులు వేయించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి అందంగా అలంకరణ చేస్తున్నారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయం లోపల, బయట ప్రత్యేక క్యూలైన్లు, కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తి తీర్చడం కోసం ఆలయం లోపల, బయట దాతల సహకారంతో చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్యవైశ్య, వర్తకులు, రైస్‌మిల్ యజమానులు, దాత లు, స్వచ్ఛంద సంస్థలు కలిసి భక్తుల సౌక ర్యార్థం బ్రాహ్మణ సంఘం, టీటీడీ ఆవర ణలో అన్నదానం కోసం ఏర్పాట్లు చేస్తు న్నారు. ఆలయం లోపల, బయట సోడి యం హైపోక్లోరైడ్ స్ప్రే చేయిస్తున్నారు. భక్తుల కోసం 25 క్వింటాళ్ల పులిహోర ప్రసాదం, ఒక లక్ష లడ్డు ప్రసాదాలు తయారు చేయిస్తున్నారు. 60 సీసీ కెమెరా లు దేవాలయాల పరిసరాల్లో, గోదావరి నదీ తీరంలో, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్య వేక్షిస్తున్నారు. సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ తదితరులు ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

రాజన్న ఖజానాకు రూ.2.31 కోట్ల నగదు

- బంగారం 201 గ్రాములు, వెండి 16.20 కిలోలు



హుండీ లెక్కింపు చేస్తున్న సిబ్బంది, భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఖజానాకు రూ.2 కోట్ల 31 లక్షల 65 వేల 333 నగదు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. రాజన్న ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య గురువారం హుండీలను లెక్కించారు. 201 గ్రాముల బంగారం, 16 కిలోల 200 గ్రాముల వెండి, సమకూరినట్లు తెలిపారు. రాజన్న ఆలయంలో 14 రోజుల హుండీలను లెక్కించామని, మహా శివరాత్రి జాతర సందర్భంగా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

కొండగట్టులో 10నుంచి పవిత్రోత్సవాలు



మల్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ దేవస్థానంలో ఈ నెల 10 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహి స్తున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ప్రతియేటా లోక కల్యాణార్థమై త్రయా హ్నిక దీక్షచే మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవా యితీగా వస్తోంది. పవిత్రోత్సవాల్లో భాగం గా నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పారాయణం, నిర్వహించనున్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీలు

సిరిసిల్ల టౌన్, మార్చు 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని స్కానింగ్ కేంద్రాలను గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ సూర్యశ్రీరావు ఆకస్మిక తనిఖీలు చేశారు. స్కానింగ్ కేంద్రాలలోని రికార్డులను పరిశీలించి ఫారం ఎఫ్‌లు సరిగా నిర్వర్తించవలసిందిగా సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యశ్రీరావు మాట్లాడుతూ రేడియా లజిస్ట్, గైనకాలజిస్ట్ డాక్టర్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలని అన్నారు. లింగనిర్ధారణ నిషేధిత చట్ట స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ తనిఖీలను సిరిసిల్ల పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు.

ఈ తనిఖీల్లో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల గైనకాలిజిస్ట్ డాక్టర్ సుచిత్రలక్ష్మి, జిల్లా పీవోఎంహెచ్ఎన్ ఇన్‌చార్జి డాక్టర్ సంపత్‌కుమార్, డిప్యూటీ డెమో రాజ్‌కు మార్, హెచ్ఈ బాలయ్య, సఖీ కన్సల్టెంట్ రోజా, కానిస్టెబుల్ శ్రీలత, డాటా ఎంట్రీ ఆపరేటర్ మహేష్ పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న డాక్టర్ సూర్యశ్రీరావు

యోగా శిక్షకురాలికి జాతీయ అవార్డులు



అన్నపూర్ణ

కోల్‌సిటీటౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన యోగా శిక్షకురాలు కొంకన అన్నపూర్ణ రెండు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికైంది. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరప్రదేశ్‌కు చెందిన శాంతి ఫౌండేషన్ సంస్థ సావిత్రిబాయి పూలే పేరిట వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు ఇంటర్నేషనల్ ప్రైడ్ ఉమెన్ అవార్డులను అందజేస్తుంది. ఈ అవార్డుకు అన్నపూర్ణను ఫౌండేషన్ ఎంపిక చేసింది. హన్మకొండకు చెందిన వినిశెట్టి జగదీశ్వరయ్య మెమోరియల్ ట్రస్ట్ ఇన్‌స్పెషనల్ ఉమెన్ అవార్డుకు అన్నపూర్ణను ఎంపిక చేసింది.

అడుగంటిన పెద్ద చెరువు



పెద్ద చెరువులో తగ్గిన నీరు

- చుట్టూ కాలువలున్నా ప్రయోజనం శూన్యం
- తూము ఏర్పాటు చేయాలని రైతుల విజ్ఞప్తి

మల్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో పెద్ద చెరువుకు రెం డు పక్కల కాకతీయ కెనాల్ ఉప కాలువలు ఉన్నా వేసవిలో నీరు లేక వెలవెలబోతోంది. తూము నిర్మిస్తే వేసవిలో పంటలకు సాగు నీరు అందే అవకాశం ఉం ది. చెరువుకు రెండు పక్కల కాకతీయ కెనాల్ ఉప కాలువలు ఉన్నా వేసవిలో పంటలకు పూర్తి స్థాయిలో నీరందని పరిస్థితి ఏర్పడింది. పెద్ద చెరువు కింద వం దలాది ఎకరాల భూముల్లో రైతులు సాగు చేస్తుంటా రు. ఈ చెరువుకు సమీపంలో నుంచి రెండు పక్కల డీ65, డీ67 ఉప కాలువలు నిండుగా ప్రవహిస్తున్నా యి. ఈ చెరువుపై మనాల శివారులోని దమ్మక్క చె రువు కాకతీయ కాలువ పక్కన ఉండగా అక్కడి నుం చి ప్రస్తుతం నీరు వచ్చే అవకాశం లేదు. దీంతో డీ65 నుంచి తూము ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. తూము ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాలకు సాగు నీరు అందడంతో పాటు గ్రామంలోనూ భూగర్భ జలా లు వృద్ధి చెందుతాయని రైతులు పేర్కొంటున్నారు.

తూము నిర్మించాలి

ముదుగంటి రాజు, మ్యాడంపల్లి

డీ65 ఉప కాలువ నుంచి తూము ఏర్పాటు చేస్తే పెద్ద చెరువు నింపుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తు తం కాలువ వద్ద పైపులు అమర్చి ఉన్నప్పటికీ వాటి నుంచి నీటి మళ్లింపు అంతంత మాత్రమే. దీంతో చెరువులోకి నీరు వచ్చే అవకాశం లేక పంటలకు నష్టం వాటిల్లుతోంది. గతంలో తూము ఏర్పాటు చేయాలని అధికారులను కోరాం. మళ్లీ కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తాం.





మ్యాడంపల్లిలో నీరందక ఎండుతున్న వరి, తూము ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం, ఉప కాలువ నుంచి ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్

ఎస్సారార్‌లో ముగిసిన జాతీయ సదస్సు

గణేశ్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో 'ప్రాచీన తెలంగాణ వాఙ్మ యం ఒక అవలోకనం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. కళాశాల, కరీంన గర్ తెలుగు భాగం, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రాచీన వాఙ్మయ పరిశోధనే జీవధాతు అని అన్నారు. ఇక్కడ జాతీయ సదస్సు నిర్వహిం చడం గొప్పవిషయమన్నారు. ఎందరో సాహితీ ఉద్దండులు నడయాడిన నేలలో కందపద్యంతో తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించడం ఆనందంగా ఉందన్నారు. పద్నాలుగు భాషలు వచ్చిన పండితులు ఇదే నేలలో జన్మించడం, శేషప్ప సిద్ధప్ప వంటి పద్య కవులు విలసిల్లిన కరీంనగర్ భూమి చాలా గొప్పదన్నారు. మనుషులు యాంత్రిక మైపోయిన సమయంలో సదస్సు ద్వారా గొప్ప రచయితలు వక్తలు ఒకచోట చేరడం అభినందనీయమన్నారు. డాక్టర్ వెల్దండ నిత్యానందరావు, డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, నెల్లూరు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సాగి కమలాకర్ శర్మ, బెనారస్ హిందూ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బూదాటి వెంకటేశ్వర్లు, కళాశాల తెలుగు విభాగ అధిపతి డాక్టర్ భూర్ల చంద్రశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజయ్య పాల్గొన్నారు.



మట్లాడుతున్న డాక్టర్ వెల్దండ నిత్యానందరావు

అధ్యాపకులకు గైడ్‌షిప్ అవకాశం కల్పించాలి

గణేశ్‌నగర్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసే అర్హులైన అధ్యాపకులం దరికీ గైడ్‌షిప్ అవకాశం కల్పించాలని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. సురేందర్‌రెడ్డి కోరారు. బుధ వారం ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అర్హులైన అధ్యాపకులను పీహెచ్‌డీ పర్యవేక్షకులుగా గుర్తించాలని, పరిశోధన అవకాశాలు పెంపొందించాలని అన్నారు. యూజీసీ కళాశాల విద్యాశాఖ నిబంధనలను అనుసరించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను క్లస్టర్లుగా గుర్తిం చాలన్నారు. కొన్ని కళాశాలల్లో అర్హులైన అధ్యాపకులు ఉన్నా సంబంధిత కోర్సులు అందుబాటులో లేకపోవడంతో పరిశో ధనలకు ప్రతిబంధకంగా మారిందన్నారు. కళాశాలలను క్లస్టర్‌లుగా చేసి అన్ని విభాగాలను ఒకే యూనిట్ పరిధిలోకి తీసుకొస్తే అడ్డంకులు తొలగిపోతాయన్నారు. టీజీసీజీటీఏ ఎస్‌యూ కోఆర్డినేటర్ డాక్టర్ కె. మల్లారెడ్డి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, సంఘం బాధ్యులు డాక్టర్ టి.శ్రీనివాస్, ఎస్.రమేష్ బాబు ఉన్నారు.



వీసీకి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు


కరీంనగర్‌లో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


మానకొండూర్‌లో..


చిగురుమామిడిలో..

బీజేపీ శ్రేణుల సంబరాలు

భగత్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంపై గురువారం ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి గెలుపొందడంపై కరీంనగర్‌లోని విద్యానగర్ మోదీ చౌక్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు నరహరి లక్ష్మారెడ్డి బండ రమణారెడ్డి, ఎన్నం ప్రకాశ్, వాసు, నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి, తిరుమల్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, చందర్, నరసింహారెడ్డి, మాధవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, సంజీవ్, మోహన్‌రెడ్డి, రాకేష్, మహిపాల్‌రెడ్డి, అంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌లో..

మానకొండూర్: మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం వాసుదేవరెడ్డి, అప్పని తిరుపతి, కుమార్, రమేశ్, ప్రదీప్ నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నంలో..

శంకరపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయంపై శంకరపట్నం మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, నాయకులు శ్రీనివాస్, సంపత్, సారయ్య, సాగర్, జగ్గారెడ్డి, వెంకటలక్ష్మి, జైపాల్, శ్రీకాంత్, శ్రీనివాస్, వీరార్జున్, సాయిప్రకాష్, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, రాజు, కొండాల్‌రెడ్డి, ప్రవీణ్, రాజేందర్, ప్రశాంత్, రాజేష్, మహిపాల్ పాల్గొన్నారు.

రామడుగులో..

రామడుగు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపొందడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. నాయకులు మేకల ప్రభాకర్ యాదవ్, ఉప్పు శ్రీనివాస్, బండ తిరుపతిరెడ్డి, పోచంపల్లి నరేష్, పూరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, అంజిబాబు, కట్ట రవీందర్, వేముండ్ల కుమార్, బద్దం లక్ష్మారెడ్డి ఉన్నారు.

చిగురుమామిడిలో..

చిగురుమామిడి: చిగురుమామిడిలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు పోలోజ్ సంతోష్‌కుమార్, పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్, శంకర్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరంలో..

గన్నేరువరం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య గెలుపుతో మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గుంటుక శంకర్, ఏలేటి చంద్రారెడ్డి, పుల్లెల రాము, బండి తిరుపతి, పంబాల రాజశేఖర్, గుంటుక లక్ష్మీపతి పాల్గొన్నారు.


హుజూరాబాద్‌లో..

ముందస్తు మహిళా దినోత్సవం

సుభాష్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో మగువా కిట్టి ఆధ్వర్యంలో గురువారం ముందస్తు మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేట్ కట్ చేశారు. అనంతరం మేముసైతం యువసేన ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించిన మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రవళిక, శ్వేత, రాధ, షాలిని, సంధ్య, సాహితి, ఝాన్సీలక్ష్మి, ఉష, ఉమ, కృష్ణవేణి పాల్గొన్నారు.

విశిష్ట పురస్కారాలకు ఎంపిక

కరీంనగర్ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏటా అందజేసే విశిష్ట పురస్కారాలకు ముగ్గురు మహిళలను ఎంపిక చేసినట్లు కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పొన్నం రవిచంద్ర, లక్ష్మీగౌతమ్ తెలిపారు. రచయిత్రి తంగెళ్ల శ్రీదేవీరెడ్డి, నర్తకి గుత్తా నాగదుర్గ, జానపద గాయని గొట్టె కనకవ్వ ఎంపికైనట్లు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నైతిక విజయం నాదే

ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

సుభాష్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విజయం తనదేనని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నామినేషన్ వేసిన నాటి నుంచి ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకులు తనను ఒత్తిడి చేశారని ఆరోపించారు. అలా ఒత్తిడి చేసినా తాను తలొగ్గకుండా పోటీలో నిలిచినట్లు చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఓటర్ల వద్దకు వెళ్లి ప్రలోభాలకు గురిచేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలోని ముఖ్యనాయకులు ట్రస్మా సంఘం నేతలకు ఫోన్ చేసి భయభ్రాంతులకు గురిచేసి వారివైపునకు తిప్పుకున్నారని అన్నారు. జాతీయ పార్టీలని చెప్పుకుంటూ ఓటుకు నోటు ఇవ్వడం సరికాదన్నారు. అలాంటప్పుడు ఎన్నికలు ఎందుకు నిర్వహించాలని, ప్రభుత్వమే నేరుగా ఎమ్మెల్సీ పదవులకు వేలం పెడితే ఆదాయం సమకూరేదని విమర్శించారు. ఎమ్మెల్సీగా గెలుపొందిన అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్‌టీ)లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల(ఎస్ ఎస్ఏ)కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కస్తూర్బా, గురుకులాల్లో పనిచేసే కాంట్రాక్ట్ టీచర్లకు సమానపనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత వంటివి కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. హెల్త్‌కార్డులు అందజేయాలని, ఇన్సూరెన్సులు వర్తింపజేయాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని, ప్రతీ సమస్యపై తన గళాన్ని వినిపిస్తానని, పట్టభద్రులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌రావు

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన చికిత్స

● గర్భసంచి నుంచి గడ్డలు తొలగించిన వైద్యులు

సుభాష్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్యకేంద్రంలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన బూసారపు గంగ(36) వివాహమైన 17 ఏళ్లకు గర్భందాల్చింది. కాన్పుకోసం ఈనెల 4న జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో చేర్పించారు. ఆమెకు పలు వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు గర్భసంచిలో గడ్డలు ఉన్నట్లు గుర్తించారు. ఈనెల 5న ఆమెకు ఆపరేషన్ నిర్వహించగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవంతోపాటు సుమారు 10 గడ్డలను కూడా తొలగించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. జిల్లా జనరల్ ఆసుపత్రిలో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ ఆపరేషన్‌కు ప్రైవేటు ఆసుపత్రిలో సుమారు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు అవసరమవుతాయని, మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో ఉచితంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖత్, డాక్టర్ సంగీత, డాక్టర్ మనీషా, డాక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సామగ్రి విక్రయ హక్కులకు వేలం

కరీంనగర్ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో కొబ్బరి కాయలు, వాహన, పూజా సామగ్రి అమ్మకాలు, కొబ్బరిముక్కల పోగు హక్కుల కోసం సోమవారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఈవో నాగారపు శ్రీనివాస్ ఒక ప్రకనలో తెలిపారు. ఔత్సాహికులు శుక్రవారం నుంచి ఆలయంలో సంప్రదించాలని కోరారు. కాల పరిమితి ఒక సంవత్సరం వరకు ఉంటుందని పేర్కొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై స్పెషల్ ఫోకస్

(5వ పేజీ తరువాయి)

వాటి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఆస్తి పన్నులు, నల్లా బిల్లులు, ఇతరత్రా పన్నులను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలంటూ హోర్డింగ్‌లు, మైకుల ద్వారా విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. వంద శాతం ఆస్తిపన్నులు వసూలు చేయాలని నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించడంతో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి ప్రతిరోజు ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టిసారిస్తూ వార్డు అధికా రులతో సమావేశాలను నిర్వహించి, సమస్యలుంటే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి కరాటేలో 'మానేరు' విద్యార్థులకు పతకాలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని రంగినేని గార్డెన్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించినట్లు విద్యాసంస్థల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. వెపన్, కటాస్ విభాగాల్లో రాణించిన స్నితిక విక్షు, దిక్షు స్వర్ణం, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి అభినందించారు. ఆత్మవిశ్వాసానికి, ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే అఖిల భారత పద్మశాలి మహాసభ, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభను విజయవంతం చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం ధార్మిక విభాగం కార్యదర్శి చిలుక నరసప్ప పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ఆదర్శ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘ భవనంలో హలో పద్మశాలి... చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసప్ప మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న వివిధ రంగాలకు చెందిన పద్మశాలి కులబాంధవులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. పద్మశాలి కులస్తులు, చేనేత రంగాల వృత్తుల వారి సమస్యల పరిష్కారం, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు, సబ్సిడీలు, వాటాలు తదితర అంశాలపై మహాసభల్లో చర్చించాలని అన్నారు.

టన్నెల్ ప్రమాద ఘటనపై విచారణ చేపట్టాలి

భగత్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన టన్నెల్ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ డిమాండ్ చేశారు. టన్నెల్ పనుల్లో ఒక్కసారిగా మట్టి దిమ్మెలు కూలి గల్లంతైన వారి ఆచూకీ తెలియలేదని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

ధన ప్రవాహంతోనే బీజేపీ గెలుపు

కరీంనగర్ అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ధన ప్రవాహంతోనే గెలిచిందని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం చేసుకున్నాయని, కేసులకు భయపడే కేసీఆర్, బీజేపీకి మద్దతు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవద్దనే దురుద్దేశంతో బీఆర్ఎస్, బీజేపీ ఒకటయ్యాయని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ఎక్కడ తమ కుటుంబాన్ని ఇబ్బందులు పాలు చేస్తాడోనని భయంతో కేసీఆర్ బీజేపీకి మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. బీజేపీ రోజు రోజుకు ఆదరణ కోల్పోతున్నదని, ప్రజలు నమ్మడం లేదని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నిరుద్యోగులకు పదేళ్ల కాలంలో ఎన్ని ఉద్యోగాలు కల్పించారో, ఏం న్యాయం చేశారో బీజేపీ నేతలు ఆత్మవంచన చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి అండగా నిలిచిన నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భగత్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ధనబలంతో గెలిచిందని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటుకు రూ.5వేలు, పట్టభద్రుల స్థానంలో ఓటుకు రూ.3 వేల చొప్పున పంపిణీ చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్‌లోని నాయకత్వంఐక్యంగా పనిచేయాలని బీజేపీకి అడ్డుకట్ట వేయాలని తెలిపారు.

నిబంధనల ప్రకారం ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలి

హుజూరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్ అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో జరిగే పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను ఎంఈవో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన సమయంలోనే పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రీఫైనల్ పరీక్షల ముందే ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రీఫైనల్ పరీక్షలు రాయడానికి వసతులు కల్పించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీకి కౌంట్ డౌన్ : బీజేపీ

భగత్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీకి కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తిరుగులేని శక్తిగా అవతరించిందన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు అండగా నిలిచిన ఉపాధ్యాయ, ఉద్యోగ, పట్టభద్రులకు, విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ అవుట్‌డేటెడ్ పార్టీ అయ్యిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందన్నారు. రేవంత్‌రెడ్డిప్రభుత్వం మోసపూరితమైన హామిలతో గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులపాలు చేస్తోందన్నారు. ఆ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పారన్నారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్లు సునీల్‌రావు, శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లకు అందని పారితోషికం

చిగురుమామిడి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం నవంబరులో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యూమరేటర్లకు ఐదు నెలలు గడిచినా అందాల్సిన డబ్బులు నేటి వరకు అందలేదు. మండలంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలో 128 బ్లాక్‌లో 150 మంది సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు. దాదాపు మండల వ్యాప్తంగా 14 వేలకు పైగా దరఖాస్తులను సర్వే చేశారు. డాటా ఎంట్రీ కోసం 53 మంది విధులు నిర్వహించారు. కొన్ని జిల్లాల్లో సర్వే డబ్బులు చెల్లించారు. జిల్లాలో మాత్రం ఎన్యూమరేటర్లకు డబ్బులు చెల్లించకపోవడంతో ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికైనా అందించాలని కోరుతున్నారు.

'ఎమ్మెల్సీ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు'

హుజూరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సింగిరాల రామరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలిచి టీచర్స్ ఎమ్మెల్సీగా మల్క కొంరయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి చారిత్రక విజయాన్ని చేకూర్చిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి సర్కార్‌కు ఉద్యోగ ఉపాధ్యాయులు, పట్టభద్రులు గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు.

భవితలో సలహాలు సూచనల బాక్స్ ప్రారంభం

తిమ్మాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండి కాలని మహాత్మనగర్‌లో గల భవిత కేంద్రంలో సలహాలు, సూచనల బాక్స్‌ను జిల్లా సెక్టోరియల్ అధికారి ఆంజనేయులు, అశోక్ రెడ్డి సంతకం చేసి సీల్ వేసి బాక్స్‌ను గురువారం ప్రారంభించారు. అనంతరం మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని వ్యక్తులు ఎవరైనా భవిత కేంద్రం గురించి సలహాలు సూచనలు ఇచ్చి భవిత అభివృద్ధికి పాల్పడవచ్చని అన్నారు. ఐఈఆర్‌పీలు రాపర్తి గణేష్, పద్మ పాల్గొన్నారు.

మానకొండూర్ చెరువు కట్టపై ముళ్లపొదలు

● సుందరీకరణ చేసినా ప్రయోజనం సున్నా ● నీరు లేక ఎండిపోతున్న మొక్కలు


చెరువు కట్టను కమ్మేసిన ముళ్ల పొదలు


మానకొండూర్ చెరువు కట్టపై ఎండుతున్న మొక్కలు

మానకొండూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా మానకొండూర్ చెరువు పూడిక తీతకు రూ. 5.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో ప్రభుత్వం మూడు కోట్లను మంజూరు చేయడంతో అక్కడి వరకు సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేశారు. సుడా నిధులు మరో రెండు కోట్లు చెరువు కట్ట సుందరీకరణకు మంజూరు చేసింది. ఈ నిధులతో కట్టకు ఇరువైపులా రెయిలింగ్ విఠలేశ్వర ఆలయం సుందరీకరణ, ఆలయం చుట్టూ ప్లాట్‌ఫాం, వివిధ రకాల మొక్కలు, సిమెంట్ కుర్చీలు, విద్యుత్ లైట్లు, కమాన్ చెరువు కట్టకు ఇరువైపులా మొక్కలు నాటారు. కేంద్రప్రభుత్వ నిధులతో కట్టపై సీసీ రోడ్డును నిర్మించగా నాణ్యత లోపంతో అది పగుళ్లబారింది. మొక్కలకు నీరు అందకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. గడ్డితో పాటు ముళ్ల పొదలు కట్టకు ఇరువైపులా రోడ్డు పైకి రావడంతో ఉదయం వాకింగ్ చేసే వారితో పాటు కట్టపై నుంచి వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. మానకొండూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చెరువు కట్టపై అహ్లాదంగా గడిపేందుకు తీర్చిదిద్దినా నిరుపయోగంగా మారింది.అంతేకాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మొక్కలు ఎండిపోతుంటే పట్టించుకునే వారే కరువయ్యారు. కట్టకు ఇరువైపులా ముళ్ల చెట్లు మొలిచి వాటి కొమ్మలు దారిని కమేస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని పిచ్చి మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన గ్రామదేవతల ఉత్సవాలు


బేతిగల్‌లో పోచమ్మ ఆలయానికి బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

వీణవంక, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలంలోని బేతిగల్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న భూలక్ష్మి.. మహాలక్ష్మి.. బొడ్రాయి.. పోచమ్మ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకుడు నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహాలు ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం మహిళలు మంగళహారతులతో వచ్చి యాగశాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు, మండలంలోని బేతిగల్‌లో పోచమ్మ బోనాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా డప్పు సొప్పులతో, ఆట పాటలతో మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు.

● ప్రణవ్ ప్రత్యేక పూజలు

గ్రామదేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ పాల్గొని పూజలు నిర్వహించారు.

పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కిట్స్‌జెన్-2025కు సంబంధించిన గోడ పత్రికను గురువారం మాజీ ఎమ్మెల్యే, కళాశాల సెక్రెటరీ వొడితల సతీష్‌కుమార్, డైరెక్టర్ శంకర్‌లు ఆవిష్కరించారు. ఈ నెల 20, 21వ తేదీల్లో క్రీడా సాహిత్య, సాంస్కృతిక ఉత్సవాల పేరిట నిర్వహించే కిట్స్‌జెన్ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ శంకర్ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాజేశ్వర్‌రావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, డైరెక్టర్ శంకర్

హోలీ వేడుకలు మొదలు

ఇల్లందకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో హోలీ వేడుకలు మొదలయ్యాయి. పండగ వచ్చిందంటే చాలు పిల్లల సందడి మొదలవుతుంది. హోలీకి తొమ్మిది రోజులు ముందు జాజిరి.. జాజిరి అంటూ పిల్లలు ఇంటింటికీ తిరుగుతారు. ఈ నెల 14న హోలీ పండుగ ఉండడంతో ఇల్లందకుంట మండలంలోని గ్రామాల్లో జాజిరి ఆట మొదలైంది. పిల్లలు ఈ ఆటను ఆడేందుకు కోలలను తయారు చేసుకొని ఇంటింటికి తిరుగుతూ పాటలు పాడుతారు. ఇంటి యజమానులు ఇంటికి వచ్చిన ఆటగాళ్లకు ధాన్యం, డబ్బులు అందజేస్తారు. ఈ ఆటను తొమ్మిది రోజులు ఆడుతారు. అనంతరం కాముడి దహనం చేసి మరుసటి రోజు హోలీ జరుపుకుంటారు.

పుస్తె మట్టెల పంపిణీ

శంకరపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన కుర్రె రమ-రాజయ్య కుమార్తె, మెట్‌పల్లి గ్రామానికి చెందిన బాకారపు స్వరూప-ప్రభాకర్ కుమార్తె వివాహం గురువారం వేర్వేరుగా నిర్వహించగా కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి పథకం కింద పుస్తెమట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుస్తె మట్టెలను డెయిరీ అసిస్టెంట్ మేనేజర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ వెంకటేష్ అందజేశారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ అయిలయ్య, శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ పాస్టర్లకు అవార్డులు

చొప్పదండి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని హోలీషాలోమ్ చర్చిలో వాయిస్ ఆఫ్ లవ్ ఫౌండేషన్ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉత్తమ పాస్టర్లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ మాట్లాడుతూ నిజమైన సేవ చేసే పాస్టర్లు క్రైస్తవానికి వరంలాంటి వారన్నారు. సమాజంలో ఎన్నో రకాల ఇబ్బందులు ఉన్నాయని వాటిని ఎదుర్కొంటూ మంచిని ప్రోత్సహిస్తున్న పాస్టర్లను సన్మానం చేయడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ పగడాల, సంస్థ చైర్మన్ ఎజ్రా మల్లేశం, బిషప్‌లు శాంతి కుమార్, అమోస్, యాది ప్రకాష్, అబ్రహం, వినయ్‌సాగర్, సాంసన్, ప్రకాష్ పాల్గొన్నారు.